క్లుప్తంగా

మిథున్‌రెడ్డిని కలిసిన రాజు



ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన కేఎస్‌ఎన్ రాజు

మలికిపురం: వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్ రెడ్డిని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేఎస్‌ఎన్ రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. బెయిల్‌పై విడుదలైన మిథున్‌రెడ్డిని మంగళవారం విజయవాడలో కలిసి ఈ మేరకు రాజు సంఘీభావం తెలిపారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర నాయకులు తెన్నేటి కిషోర్, కుసుమ చంద్రశేఖర్, దొంగ నాగ సత్యనారాయణ, రుద్రరాజు చిన్న రాజా, ముప్పర్తి త్రిమూర్తులు తదితరులు మిథున్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన శ్రీనివాసరావు



దుర్గా మల్లేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు

పి.గన్నవరం: దసరా మహోత్సవాల సందర్భంగా పి.గన్నవరం శివారు తాటికాయల వారిపాలెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద జరిగిన దుర్గా మల్లేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవ్వాలని కోరుతూ అమ్మవారి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సుమారు 450 మంది మహిళలకు ఆయన పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, పేరిచర్ల కుమార్‌రాజు, పుచ్చకాయల నర్సింహమూర్తి, తాటికాయల మధు తదితరులు పాల్గొన్నారు.

సంఘ అభివృద్ధికి సహకరించాలి

అంబాజీపేట: సొసైటీ ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని సొసైటీ చైర్మన్ అరిగెల సూర్యనారాయణ మూర్తి (సూరిబాబు) రైతులను కోరారు. అంబాజీపేట సొసైటీ కార్యాలయంలో మహాజన సభ సూరిబాబు అధ్యక్షతన మంగళవారం జరిగింది. డీసీసీబీలో కుదవపెట్టిన బంగారంపై ఎక్కువ శాతం వడ్డీని వేస్తున్నారని, దాంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాకలగరువు ఎంపీటీసీ సభ్యుడు వాకపల్లి దొరబాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వాణిజ్య, జాతీయ బ్యాంకుల కన్నా సొసైటీల ద్వారా డిపాజిట్లపై 8.5 శాతం వడ్డీని ఇస్తున్నామని, అందుకే బంగారం రుణంపై 9.9 వడ్డీ వేస్తున్నారని డీసీసీబీ అంబాజీపేట బ్రాంచ్ మేనేజర్ బి.నాగేశ్వరరావు సభ్యులకు వివరించారు. అంతకు ముందు సొసైటీ సీఈవో కుంపట్ల అయ్యప్ప నాయుడు సొసైటీ లావాదేవీల ఆర్థిక నివేదికను సభకు సమర్పించారు. కార్యక్రమంలో త్రిసభ్యకమిటీ సభ్యులు ఉందుర్తి సత్యనారాయణ, పితాని వెంకట సత్యప్రసాద్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, మద్దింశెట్టి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కాపాడికోవాలి..!

- కొత్త ఆస్పత్రులు, ఉప కేంద్రాలు లేని పరిస్థితి
- సెమన్ స్ట్రాస్, మందుల నిల్వకు అవస్థలు
- పలు ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత



శిథిలస్థితిలో మలికిపురం ప్రాంతీయ పశువైద్య కేంద్రం

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో పశువుల ఆసుపత్రులకు భవనాలు సక్రమంగా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే పలు ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత కూడా తీవ్రంగా వేధిస్తోంది. శివారు ప్రాంతాల్లో పెరిగిన అవసరాలకు అనుగుణంగా కొత్త పశువుల ఆసుపత్రులు, ఉప కేంద్రాల ఏర్పాటు లేదు. ఫలితంగా పాడితో కళకళలాడాల్సిన అనేక గ్రామాల్లో పశువుల పెంపకం నానాటికీ కుంటుపడుతోంది. గ్రామాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా ఉన్న ఆసుపత్రుల్లో కనీసం ఖాళీ అయిన సిబ్బంది పోస్టులను కూడా భర్తీ చేయడం లేదు. దీంతో ఉన్న సిబ్బందే అదనపు డ్యూటీ చేయాల్సి వస్తోంది. అలాగే పలు ఆసుపత్రుల్లో కాంపౌండర్లు కూడా లేకపోవడంతో రైతులు తమ పశువులను పక్క గ్రామాలకు తీసుకెళ్లాల్సి వస్తోంది. అదే విధంగా ఉన్న వీఏ, ఓఎస్ తదితర పోస్టుల సిబ్బందికి జీతాలు కూడా అంతంత మాత్రమే కావడంతో అరకొర జీతాలతో వారు నెట్టుకు రావాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో పశువుల పెంపకం రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులు

మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు ప్రాంతీయ పశు వైద్య కేంద్రంగా ఉన్న మలికిపురంలో శిథిల పశు వైద్యశాలతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ సిబ్బంది ఉండేందుకు కూడా ప్రమాదకరంగా ఉంది. ఇక మందులు, సెమన్ స్ట్రాస్ నిల్వ ఉంచే అవకాశం లేదు. ఈ కేంద్రం పరిధిలో 37 గ్రామాలు ఉన్నాయి. ఒక ఏడీ పోస్టు డాక్టరు ఉన్నప్పటికీ ఇక్కడ సిబ్బంది కొరత ఉంది. కేశనపల్లి ఉప పశువుల ఆసుపత్రిలో సేవలందించే ఆసుపత్రి కూడా శిథిల భవనంలో నడుస్తుంది. అయితే ఇక్కడ గ్రామాలు, పశువుల సంఖ్య అధికం. కావున ప్రత్యేకంగా పశువుల ఆసుపత్రి ఉండాలి. అది లేకపోగా ఉప కేంద్రం మాత్రమే ఉంది. తూర్పుపాలెం, గొల్లపాలెం, పడమటిపాలెం, గూడపల్లి, పల్లిపాలెం తదితర గ్రామాలకు ఈ ఆసుపత్రే ఆధారం. గుడిమెళ్లంక ఆసుపత్రి పరిధిలో రామరాజులంక, దిండి, మేడిచర్లపాలెం, మట్టపర్రు గ్రామాలున్నాయి. ఇక్కడ కూడా సిబ్బంది సంఖ్య పెంచాల్సి ఉంది. లక్కవరం పశువుల ఆసుపత్రిలో ఒక వీఏ, ఓఎస్ పోస్టులు గత కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. బట్టేలంక, ఇరుసుమండ, శంకరగుప్తం, బట్టేలంక గుబ్బలపాలెం తదితర గ్రామాల రైతులకు ఇది అందుబాటులో ఉంటుంది. సఖినేటిపల్లి మండలంలో ఉన్న నాలుగు పశువుల ఆసుపత్రులకు అంతర్వేదిపాలెం ఆసుపత్రికి వైద్యులు లేరు. మోరిలో కూడా సిబ్బంది కొరత ఉంది. రాజోలు ప్రాంతీయ పశువైద్య కేంద్ర పరిధిలో మామిడికుదురు ఆసుపత్రికి భవనం లేదు. ఈ కేంద్రం పరిధిలో కూడా పలు సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఇదీ పశు సంపద

రాజోలు, మలికిపురం ప్రాంతీయ పశు వైద్య కేంద్రాల పరిధిలో మొత్తం 69 గ్రామాల్లో మొతం 31 వేల గేదెలు, ఆవులు ఉన్నాయి. మేకలు, గొర్రెలు కలిపి సుమారు 15 వేలు ఉన్నాయి. అలాగే సుమారు లక్ష వరకూ కోళ్లను రైతాంగం పెంచుతుంది. అలాగే ఐదు వేల కుక్కలు ఉన్నాయి. సుమారు 200కు పైగా పందుల పెంపకం కూడా జరుగుతుంది. ఇక కేర్‌టేకర్ ఉంటే కోతులకు, పక్షులకు కూడా ఈ సిబ్బంది వైద్యం అందిచాల్సిందే.



కేశనపల్లిలో అసంపూర్తిగా ఉన్న పశు వైద్య కేంద్రం

ఏళ్ల తరబడి శిథిలావస్థలో..

పలు ఆసుపత్రులకు భవనాల కొరత కూడా వేధిస్తోంది. కేశనపల్లి ఆసుపత్రికి సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మాణం ప్రారంభమైన భవనం నేటికీ పూర్తి కాలేదు. అప్పట్లో సుమారు రూ.4 లక్షలతో నిర్మాణం ప్రారంభమై నిధులు సరిపడక అసంపూర్తిగా ఉంది. మలికిపురం ఆసుపత్రి భవనం సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం అది శిథిలస్థితిలో ఉంది. వర్షం నీరు లోపల పడి విలువైన మందులు తడిసి మద్దవుతున్నాయి. కొత్త భవనం మంజూరు కావడం లేదు. గ్రామాల్లో పలు చోట్ల కొత్తగా ఉప కేంద్రాలు కావాలని ఆయా గ్రామ సభల్లో వినతిపత్రాలు వచ్చాయి. వాటిని బుట్టదాఖలు చేశారు. దీంతో ఆయా ఆసుపత్రుల పరిధిలో శివారు గ్రామాల రైతులు ఇక్కట్లు పడుతున్నారు. అంతర్వేదికర, పల్లిపాలెం గ్రామాలు శివారులో ఉండటంతో పశువులకు వైద్య సేవలు అందడం లేదు. అప్పనరామునిలంక మండలానికి శివారుగా ఉంటుంది. ఇక్కడ ప్రత్యేక పశువుల ఆసుపత్రి అవసరం. దగ్గర్లోని అంతర్వేదిపాలెం ఆసుపత్రిలో కూడా వైద్యులు లేక వీరి అవస్థలు వర్ణణాతీతం. దిండి, రామరాజలంక గ్రామాలకు ప్రత్యేకంగా ఒక గ్రామీణ పశువుల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కోరుతున్నా.. ఫలితం మాత్రం శూన్యం. చింతలమోరి గ్రామం మండలానికి శివారులో ఉంటుంది. ఇక్కడ కూడా ఉపకేంద్రం అవసరం. శంకరగుప్తంలో కూడా ఉపకేంద్రం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రభుత్వం శ్రద్ధ వహించాలి



రాజోలు, మలికిపురం ప్రాంతీయ పశువైద్య కేంద్రాల పరిధిలో అనేక శివారు గ్రామాలు ఉన్నాయి. ఇక్కడే పశువుల పెంపక అధికంగా ఉంటుంది. అక్కడ ప్రత్యేక పశు వైద్య కేంద్రాలు కావాలని ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం శ్రద్ధ వహించాలి. అలాగే పశువుల పెంపక దార్లకు ప్రత్యేక రాయితీలు ఇచ్చి పాడి పరిశ్రమను ప్రోత్సహించాలి.

– దేశినీడి ఉదయ భాస్కరరావు, రామరాజులంక.

పాడి పరిశ్రమకు ప్రోత్సాహం కరవు



గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధి ప్రభుత్వ ప్రోతాహం కరువైంది. పెరిగిన అవసరాలకు అనుగుణంగా భవనాల నిర్మాణం లేదు. ఉప కేంద్రాలు, ప్రత్యేక ఆసుపత్రుల ఏర్పాటు లేదు. రాయితీపై గేదెలను, పశుగ్రాసాన్ని రైతులకు అందిస్తే ఉపాధితో పాటు, ఆరోగ్యకర పాలు ప్రజలకు అందుతాయి. కూటమి ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం లేదు.

– గొల్లపల్లి సూర్యారావు, పశుసంవర్ధక శాఖ మాజీ మంత్రి.

ప్రతిపాదనలు పంపించాం



మలికిపురం పశువుల ఆసుపత్రితో పాటు, ఇతర అంశాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారులు దీనిపై నివేదిక సిద్ధం చేశారు. నిధుల లభ్యతని బట్టి ఈ ఏడాది నిర్మాణాల పనులు మంజూరవుతాయి.

– వేంకటేశ్వరరావు, పశు సంవర్ధక శాఖ ఏడీ, మలికిపురం.

అభిమానిని కలిసిన జగ్గిరెడ్డి



మొక్కు తీర్చుకుంటున్న మోహన్‌రెడ్డితో కలిసి నడుస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: వైఎస్సార్ సీపీ అభిమానిగా తమ నాయకులు గెలవాలని మొక్కుకొని అది తీర్చుకుంటున్న అభిమానిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి కలిసి కొంతదూరం వారితో పాదయాత్రగా నడిచారు. రావులపాలెనికి చెందిన ద్వారంపూడి మోహన్ రెడ్డి 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా, చిర్ల జగ్గిరెడ్డి ఎమ్మెల్యేగా గెలవాలని, గెలిస్తే భవానీ మాల వేసుకొని కాలినడకన విజయవాడ దుర్గమ్మ సన్నిధికి వెళ్లి దర్శనం చేసుకుంటానని మొక్కుకున్నారు. మొక్కు తీర్చుకోవటానికి 5 రోజుల క్రితం కాలినడకన బయలుదేరారు. మార్గ మధ్యలో హనుమాన్ జంక్షన్ వద్ద మంగళవారం మోహన్‌రెడ్డిని కలిసి అతని కూడా కిలోమీటరు మేర జగ్గిరెడ్డి నడిచారు. కొన్ని అనివార్య కారణాల వల్ల గత 5 ఏళ్లుగా కుదరకపోవటంతో ఈ ఏడాది మాల వేసుకొని మొక్కు తీర్చుకుంటున్నట్టు మోహన్‌రెడ్డి తెలిపారు.

నరసింహదేవరకు నివాళులు



ఆలమూరులో నరసింహదేవర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సొసైటీ సిబ్బంది

ఆలమూరు: దేశ సహకార సంఘ ఉద్యమ పితామహుడు, ఉమ్మడి మద్రాసు రాష్ట్ర మాజీ ఎమ్మెల్సీ నరసింహదేవర సత్యనారాయణమూర్తి వర్ధంతి మంగళవారం జరిగింది. స్థానిక బొబ్బా చిన వీరన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో త్రిసభ్య కమిటీ చైర్మన్ వంటిపల్లి సతీష్ ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల నుంచి రైతులు విచ్చేసి మాజీ ఎమ్మెల్సీకి ఘన నివాళులర్పించారు. అనంతరం సొసైటీ సిబ్బంది నరసింహదేవర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, రాంబాబు, రామానుజుల శేషగిరిరావు, సాలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రైవేటీకరణ మానుకోవాలి

కొత్తపేట: రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజే సుధాకర్‌బాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపుమేరకు పార్టీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేట నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, యువత కొత్తపేటలో డేవిడ్‌రాజు స్వగృహం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా అమలాపురం తరలివెళ్లారు. కొత్తపేటలో డేవిడ్‌రాజు మాట్లాడుతూ, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అన్ని ప్రతిపక్షాలు, విద్యావేత్తలు, మేధావులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. సామాన్య వర్గాలకు వైద్యం, వైద్య విద్య అందుబాటులో ఉండాలనే జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వ పీపీపీ విధానం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకేనని ఆందోళన వ్యక్తం చేశారు. పీపీపీ విధానానికి ఈ ప్రభుత్వం కొత్త భాష్యం చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర బూత్ కమిటీల విభాగం కార్యదర్శి సాకా ప్రసన్నకుమార్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్, ఎంపీటీసీ సభ్యుడు ముళ్ల జనార్దన్, యువజన విభాగం, స్టూడెంట్ విభాగం ప్రతినిధులు వంగలపూడి బాబూరావు, ఇసుకపట్ల సునీల్, నేరేడుమిల్లి నరేష్, డాక్టర్‌బాబు, ఎస్సీ విభాగం జిల్లా, మండల శాఖల సభ్యులు పాల్గొన్నారు.



కొత్తపేట నుంచి అమలాపురం తరలివెళ్తున్న డేవిడ్‌రాజు, సూర్యారావు, వేణుగోపాలరావు తదితరులు

మామిడికుదురు: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని రాజోలు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ మంగళవారం మామిడికుదురులో పార్టీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు వైద్య విద్యను దూరం చేసేందుకే ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య స్వగృహం నుంచి రాజోలు నియోజకవర్గానికి చెందిన పార్టీ ఎస్సీ నేతలు ర్యాలీగా అమలాపురంలో నిరసన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ నిరసనలో పార్టీ ఎస్సీ అనుబంధ కమిటీల నేతలు కొల్లాబత్తుల చిట్టిబాబు, ఉచ్చుల మోహన్, తాడి సహదేవ్, బుంగ శ్రీను, భూపతి మహేంద్ర, కుసుమ శ్రీధర్, బళ్ల కుమార్, కొల్లాబత్తుల మున్న, కుసుమ పెరుమాళ్ల కుమార్, చింతా ప్రసాద్, మోకా సురేష్, కుసుమ విష్ణుమూర్తి, బళ్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.



మామిడికుదురులో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఓఎన్‌జీసీ అధికారుల ప్రకటనపై ఆగ్రహం

మామిడికుదురు: పాశర్లపూడి బాడవలో ఓఎన్‌జీసీ పైప్‌లైన్ లీకేజీను అదుపు చేసేందుకు మంగళవారం అక్కడకు జేసీబీతో చేరుకున్న సిబ్బందిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఏ విధమైన లీకేజీ ఏర్పడలేదంటూ తప్పుడు ప్రకటనలు ఎందుకు చేశారో ముందు వివరణ ఇవ్వాలని నిలదీశారు. లీకేజీని అదుపు చేయడం మానేసి అటు ప్రజల్ని, ఇటు ప్రభుత్వ అధికారులను ఓఎన్‌జీసీ తప్పుదోవ పట్టిస్తోందంటూ తీవ్రంగా మండిపడ్డారు. దీంతో ఏం చేయాలో తెలియక ఓఎన్‌జీసీ అధికారులు తలలు పట్టుకున్నారు. సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది వచ్చి స్థానికులకు నచ్చ చెప్పారు. దీంతో స్థానికులు శాంతించారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో పైపునకు రిపైర్స్ చేసి లీకేజీని అదుపు చేశారు.

శంకరగుప్తం డ్రైన్‌పై కార్యాచరణ

మలికిపురం: రాజోలు దీవిలో దు:ఖం దాయనిగా ప్రసిద్ధి చెందిన శంకరగుప్తం డ్రైన్ అభివృద్ధి, రైతుల ఇబ్బందులపై కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఇటీవల సాక్షి పత్రికలో వరుస కథనాల కారణంగా ఈ డ్రైన్‌పై ప్రభుత్వంలో కదలిక వచ్చింది. త్వరలోనే శంకరగుప్తం డ్రైన్ పరిశీలిస్తానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటించారు. నాలుగు రోజుల క్రితం అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే మంగళవారం డ్రైన్‌లో ఐదు పడవలతో డ్రైనేజీ శాఖ ఉన్నతాధికారులతో కలిసి పది కిలోమీటర్ల పొడవున పర్యటించారు. కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం, కరవాక గ్రామాల్లో డ్రైన్ వెంబడి ఉప్పునీటి ప్రభావానికి గురై చనిపోయిన వేలాది కొబ్బరి తోటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన కేశనపల్లిలో మాట్లాడుతూ, అక్టోబర్ 2న ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా శంకరగుప్తం డ్రైన్‌ను పరిశీలిస్తారన్నారు. కేశనపల్లిలో రైతులతో జరిగే ప్రజెంటేషన్‌ను తిలకించి తగిన నిర్ణయం తీసుకుంటారన్నారు. సుమారు 26 కిలోమీటర్ల పొడవు, 500 మీటర్ల వెడల్పు గల ఈ సహజ సిద్ధ డ్రైన్ గోదావరితో సమానంగా ప్రవహిస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట డ్రైనేజీ శాఖ ఈఈ కిషోర్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ధవళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు డీసీ పినిశెట్టి బుజ్జి, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, చాగంటి స్వామి, తహసీల్దారు శ్రీనివాస్, ఎస్సై సురేష్ చుట్టుప్రక్కల గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఇంపాక్ట్



శంకరగుప్తం డ్రైన్‌లో చనిపోయిన కొబ్బరి చెట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్, అధికారులు

పెరుగుతున్న వరద ఉధృతి



అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీటిలో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడి లంక, అరిగెల వారిపేట, బూరుగులంక గ్రామాలతో పాటు, జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనర్లంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి ఏటిగట్టు నుంచి శివాయలంకకు వెళ్లే రహదారి నీట మునిగింది. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి కొనసాగుతుండటంతో ఆ గ్రామ ప్రజలు పడవలపై వెళ్తున్నారు. వరద తాకిడికి గురైన ప్రాంతాల్లో ప్రత్యేక అధికారి జయచంద్ర గాంధీ, తహసీల్దార్ పి.శ్రీపల్లవి పర్యటించారు. రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీటీ సత్యనారాయణ, ఆర్ఐ వెన్నపు డాంగే తదితరులు వారి వెంట ఉన్నారు.

కాజ్‌వేపై పడవల్లోనే ప్రయాణం

అయినవిల్లి: మండలంలోని లంక గ్రామాల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలంలోని అద్దంకివారిలంక గ్రామస్తులు అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వేపై పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. వరదతో మూడు రోజుల నుంచి తమకు ఈ తిప్పలు తప్పడం లేదని వారు చెబుతున్నారు. ఎన్ని పార్టీలు అధికారంలోకి వచ్చినా.. పాలకులు మారినా తమ దుస్థితి మారడం లేదని వాపోతున్నారు. ఎవ్వరు వచ్చినా తమకు కాజ్‌వే వంతెన నిర్మాణ పనులు చేపట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బూరుగులంక రేవులో పడవపై వెళ్తున్న ప్రజలు

ఆందోళన కలిగిస్తున్న వరద

మామిడికుదురు: గోదావరి వరద లంక గ్రామాల ప్రజల్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. తగ్గినట్లే తగ్గి మళ్లీ గోదావరి వరద పెరుగుతోంది. దీంతో తీర గ్రామాల ప్రజల్లో కలవరం మొదలైంది. అప్పనపల్లి కాజ్‌వేపై రెండడుగులకు పైగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు వరద నీటిలో తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. పాశర్లపూడి బాడవలోని కనకదుర్గమ్మ ఆలయ సముదాయాన్ని వరద నీరు ముంచెత్తింది. దీంతో వరద నీటిలో దిగి స్థానికులు గుడిలోకి వెళ్లి పూజలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి స్నాన ఘట్టం పూర్తిగా ముంపు బారిన పడింది. వరద మరింత పెరిగే అవకాశం ఉందన్న ముందస్తు హెచ్చరికలు కలవరపాటుకు గురి చేస్తున్నాయి.

అన్నదానం ట్రస్టుకు విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్య అన్నదానం ట్రస్టుకు హైదారాబాదుకు చెందిన బండారు హరికిషోర్, వనజ దంపతులు రూ.30 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని మంగళవారం ఆలయ ఉద్యోగులకు అందజేశారు. దాతకు అర్చకులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈఓ సత్యనారాయణరాజు దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

మమ్మేలగరావమ్మా.. దుర్గమ్మా..

- విశేష అలంకరణలో అమ్మవార్లు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



పి.గన్నవరంలో దుర్గాదేవిగా లక్ష్మీ కనకదుర్గమ్మ



పెదపళ్లలో దుర్గాదేవి అవతారంలో అమ్మవారు



విశేషాలంకరణలో నేదునూరు కనకదుర్గమ్మ

కొత్తపేట/మామిడికుదురు/ఆలమూరు/పి.గన్నవరం/అంబాజీపేట/అయినవిల్లి: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవి ఆలయాలు, శరన్నవరాత్ర పందిర్లలో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. కొత్తపేట మండలం బి.సావరం విజయ కనక దుర్గాదేవి అమ్మవారిని ఆలయ పునర్నిర్మాణ కర్త, ఆలయ పోషకులు బొపుసు వెంకట ఉదయభాస్కర్–వసుధ దంపతుల పర్యవేక్షణలో అర్చకుడు బిక్కవోలు సత్యనారాయణ, వేదపండితుడు, బ్రహ్మశ్రీ అనంత లక్ష్మణ కుమారాచార్యులు అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. దుర్గాష్టమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భాస్కర్–వసుధ దంపతులతో పాటు పలువురు భక్త దంపతులచే చండీహోమం నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి, కొత్తపేట, వానపల్లి గ్రామ దేవతలు బంగారమ్మ, పళ్లాలమ్మ అమ్మవార్లు, ఏనుగుల మహల్ రాజరాజేశ్వరాదేవి, బోడిపాలెం దుర్గాదేవి, వాడపాలెం జ్ఞాన సరస్వతీదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

మామిడికుదురు మండలంలోని మగటపల్లి గాయత్రి త్రిశక్తి పీఠంలో వేదన భట్ల రామశర్మ ఆశీస్సులతో బ్రహశ్రీ చెరుకుమిల్లి లక్ష్మణశాస్త్రి, గోవిందవర్జుల రామశర్మ ఆధ్వర్యంలో సామూహిక లక్ష కుంకుమార్చనలు, చండీ పారాయణ, మహాలింగార్చన, గోపూజ, హోమాలు ఘనంగా నిర్వహించారు. పాశర్లపూడిబాడవ అమ్మవారి సన్నిధిలో కుమారీ పూజ, సువాసినీ పూజ, శమీపూజ, గోపూజ, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. పెదపట్నంలంక కనకదుర్గమ్మ ఆలయంలో పలు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ ఆలయంలో కనకదుర్గమ్మ మహాగౌరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మామిడికుదురు విజయ దుర్గమ్మకు పారిజాత పుష్పాలతో విశేష అర్చన జరిపించారు. పెదపట్నంలో కనకదుర్గమ్మను గాజులతో విశేషంగా అలంకరించారు.

ఆలమూరు మండలంలో దేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు నిజరూప అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పెదపళ్ల మార్కెట్ సెంటర్‌లో భవానీ మాలధారులు పడిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయా ఆలయాలు, మండపాల వద్ద ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామ శివారు తాటికాయలవారి పాలెంలో ఉన్న కనకదుర్గమ్మ వారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మ వారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పి.గన్నవరం ఏజీ రోడ్డులోని లక్ష్మీ కనక దుర్గమ్మను భక్తులు దర్శించుకున్నారు.



మగటపల్లిలో కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు

కుంకుమ పూజలు.. లడ్డు పాటలు

అంబాజీపేటలో ఉన్న శ్రీవీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి కల్యాణ మండపంలో ప్రముఖ వేద పండితులు యలమంచలి సుబ్రహ్మణ్య శర్మ బ్రహ్మత్వంలో కుంకుమ పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి లడ్డు పాటను నిర్వహించారు. సుమారు 10 మంది యువకులు బృందంగా ఏర్పడి అమ్మవారి లడ్డు పాటను రూ.76,200కు పాడుకున్నారు. కాగా 11 కేజీల లడ్డును అంబాజీపేటకు చెందిన దినేష్ టూర్స్ అండ్ ట్రావెల్స్ యజమాని యంగలి శ్రీనివాస్ అమ్మవారికి సమర్పించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా చండీ హోమం

అయినవిల్లి మండలంలోని నేదునూరులో కొలువైన చెన్న మల్లేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న కనకదుర్గమ్మకు చండీ హోమం నిర్వహించారు. ప్రధానార్చకులు సత్యనారాయణమూర్తి అమ్మవారికి పళ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. సూర్య వెంకట సుబ్రహ్మణ్య శర్మ పరివేక్షణలో చండీ హోమం జరిపారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు.